## ఐదు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై, ఏప్రిల్ 26: స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. బ్యాంకింగ్, ఆర్థిక, కన్జ్యూమర్ డ్యూరబుల్ రంగ షేర్లలో క్రయవిక్రయాలు జోరుగా సాగడంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవడం, క్రూడాయిల్ ధరలు భగ్గుమంటుండటం, రూపాయి పతనం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను వెనక్కితీసుకోవడం పతనానికి ఆజ్యంపోసింది. చివరకు వారాంతం ట్రేడింగ్ ముగిసేసరికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 609.28 పాయింట్లు నష్టపోయి 73,730.16 వద్ద ముగిసింది. ఒక దశలో 722.79 పాయింట్లు నష్టపోయింది. అటు ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 150.40 పాయింట్లు కోల్పోయి 22,419.95 వద్ద స్థిరపడింది.




# ఫారెక్స్ రిజర్వులు డౌన్

### వరుసగా రెండోవారం 2 బిలియన్ డాలర్లు తగ్గిన నిల్వలు

ముంబై, ఏప్రిల్ 26: విదేశీ మారకం నిల్వలు మరింత పడిపోయాయి. వరుసగా రెండో వారం ఈ నెల 19తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 2.282 బిలియన్ డాలర్లు కరిగిపోయి 640.334 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ విషయాన్ని రిజర్వు బ్యాంక్ తన వారాంతపు సమీక్షలో వెల్లడించింది. అంతక్రితం వారంలోనూ రిజర్వులు 5.401 బిలియన్ డాలర్లు తరిగిపోయిన విషయం తెలిసిందే. ఈ నెల 5తో ముగిసిన వారంలో రిజర్వులు రికార్డు స్థాయి 648.562 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. అంతకుముందు సెప్టెంబర్ 2021లో రికార్డు స్థాయి 642.453 బిలియన్ డాలర్లకు చేరుకున్న విదేశీ మారకం నిల్వలు మళ్లీ నాలుగేండ్ల తర్వాత ఈ గరిష్ఠ స్థాయిని అధిగమించాయి. మరోవైపు, పసిడి రిజర్వులు 1.01 బిలియన్ డాలర్లు ఎగబాకి 56.808 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. కానీ, ప్రత్యేక డ్రాయింగ్ రైట్స్(ఎస్‌డీఆర్) 43 మిలియన్ డాలర్లు తగ్గి 18.034 బిలియన్ డాలర్లకు, అలాగే ఐఎంఎఫ్ వద్ద నిల్వలు కూడా 2 మిలియన్ డాలర్లు తగ్గి 4.631 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

**తీవ్ర ఒత్తిడిలో రూపాయి**

ఇతర కరెన్సీలతో పోలిస్తే రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నది. ప్రధానంగా అంతర్జాతీయ ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో గత కొన్ని నెలలుగా కనిష్ఠ స్థాయిలో జారుకుంటున్నది. దీంతో విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 3.793 బిలియన్ డాలర్లు తరిగిపోయి 560.86 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని ఆర్బీఐ తెలిపింది. డాలర్‌తోపాటు యూరో, పౌండ్, యెన్ కరెన్సీలు ఒత్తిడిని ఎదుర్కొనడం వల్లనే విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తులు తరిగిపోవడానికి ప్రధాన కారణమని వెల్లడించింది.

# సింగిల్ చార్జింగ్‌తో 516 కిలో మీటర్లు

### సరికొత్త మాడల్‌ను ప్రవేశపెట్టిన బీఎండబ్ల్యూ




న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూ... దేశీయ మార్కెట్‌కు ఎలక్ట్రిక్ సెడాన్ ఐ5ని పరిచయం చేసింది. ఎలక్ట్రిక్ 5 సిరీస్‌లో భాగంగా విడుదల చేసిన తొలి మాడల్ ఇదే కావడం విశేషం. ఈ కారు ధర రూ.1.20 కోట్లుగా నిర్ణయించింది. సింగిల్ చార్జింగ్‌తో 516 కిలోమీటర్లు ప్రయాణించే ఈ కారు.. కేవలం 3.8 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. అలాగే గంటకు 230 కిలోమీటర్లు ప్రయాణించనున్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. 205కిలోవాట్ల ఏసీ చార్జర్ కలిగిన ఈ కారు బ్యాటరీ కేవలం అరగంటలోనే 10 శాతం నుంచి 80 శాతం వరకు చార్జికానున్నది. 14.9 అంగుళాల టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే, 360 డిగ్రీల్లో కెమెరా, ఎలక్ట్రికల్ అడ్జస్టబుల్ సీట్లతో రూపొందించింది.

## అపోలో హెల్త్‌కోలో అడ్వెంట్‌కు వాటా

చెన్నై, ఏప్రిల్ 26: అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన సబ్సిడరీ సంస్థయైన అపోలో హెల్త్‌కో లిమిటెడ్‌లో అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ రూ.2,475 కోట్ల పెట్టుబడులు పెట్టింది. అపోలో హెల్త్‌కో, కైమెడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన హోల్‌సేల్ ఫార్మాస్యూటికల్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలో అడ్వెంట్ ఇంటర్నేషనల్‌కు 12.1 శాతం వాటా దక్కింది. వచ్చే రెండు నుంచి రెండున్నరేండ్లలో ఈ వాటాను 100 శాతానికి పెంచుకునే అవకాశం కూడా ఉన్నది.

## అదరగొట్టిన మారుతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ లాభాల్లో అదరగొట్టింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ.3,877.8 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.2,623.6 కోట్ల లాభంతో పోలిస్తే 47.8 శాతం వృద్ధి చెందడం విశేషం. వాహన విక్రయాలు టాప్‌గేర్‌లో దూసుకుపోవడం, కమోడిటీ ఉత్పత్తుల ధరలు తగ్గడం వల్లనే లాభాలు పెరగడానికి దోహదం చేసినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. గత త్రైమాసికంలో సంస్థ రూ.36,697.5 కోట్ల విక్రయాలు జరిపింది.

- 2023-24 ఆర్థిక సంవత్సరంలో తొలిసారిగా సంస్థ 20 లక్షల యూనిట్ల వాహనాలను విక్రయించింది.
- గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.13,209.4 కోట్ల నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది వచ్చిన రూ.8,049.2 కోట్లతో పోలిస్తే 64 శాతం అధికం.
- వాహన విక్రయాలతో గతేడాది సంస్థకు రూ.1,34,937.8 కోట్ల ఆదాయం సమకూరింది. అంతక్రితం ఏడాది వచ్చిన రూ.1,12,500.8 కోట్లతో పోలిస్తే 19.9 శాతం అధికం.
- రూ.5 ముఖ విలువ కలిగిన షేరుకు రూ.125 డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. 2022-23లో రూ.90 డివిడెండ్‌ను చెల్లించింది.

# కాంక్రీట్ జంగల్‌గా దేశం

*17 ఏండ్లలో 61.77 లక్షల ఎకరాల్లో నిర్మాణాలు*

*సగటున రోజుకు 350 ఎకరాల భూమి వినియోగం*

*ఇందులో మూడింట రెండు వంతులు పంట భూములే*

*పారిశ్రామికీకరణ, పట్టణీకర, వసతుల కల్పనే ప్రధాన కారణం*

*పర్యావరణానికి విఘాతం కలుగుతుందన్న ఆందోళనలు*



హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): 'భూమి కరుగుతున్నది.. ఊరు పెరుగుతున్నది..' ప్రస్తుతం దేశంలో జరుగుతున్నది ఇదే. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అవసరాలు పెరగడం, మౌలిక వసతుల కల్పన, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ.. ఇలా కారణం ఏదయినా గత రెండు దశాబ్దాల్లో దేశవ్యాప్తంగా 'బిల్ట్ అప్ ఏరియా' (నిర్మాణాలు) భారీగా పెరిగింది. 2005-06 నుంచి 2022-23 వరకు జరిగిన నిర్మాణాలపై నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్సీ), ఇస్రో సంస్థలు సంయుక్తంగా అధ్యయనం చేసి తాజాగా ఓ నివేదికను విడుదల చేశాయి. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, మౌలిక వసతుల కల్పన తదితర చర్యల ఫలితంగా గత 17 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా 2.5 మిలియన్ హెక్టార్లకుపైగా (61.77 లక్షల ఎకరాల) విస్తీర్ణంలో నిర్మాణాలు జరిగినట్టు ఆ నివేదిక వెల్లడించింది. భవనాలు (రూఫ్‌డ్ స్ట్రక్చర్లు), రోడ్లు, పార్కింగ్ (పేవ్‌డ్ సర్ఫేసెస్), కమర్షియల్, ఇండస్ట్రియల్ సైట్లు (పోర్టులు, ల్యాండ్ ఫిల్స్, క్వారీలు, రన్‌వేలు) లాంటి వాటిని బిల్ట్ అప్ ఏరియాగా.. పార్కులు, గార్డెన్లను అర్బన్ గ్రీన్ పార్కులుగా పేర్కొన్నది. బహుళ అంతస్థుల భవనాల రూపంలో తక్కువ స్థలంలోనే అధిక 'బిల్ట్ అప్ ఏరియా' అందుబాటులోకి వచ్చినట్టు తెలిపింది.

**21 లక్షల ఎకరాల భూమి వినియోగం**

బహుళ అంతస్థుల భవనాల్లో నిలువుగా అందుబాటులోకి వచ్చిన విస్తీర్ణాన్ని మినహాయిస్తే గత 17 సంవత్సరాల్లో నిర్మాణాల కోసం మొత్తం 21 లక్షల ఎకరాలకుపైగా భూమి వినియోగం జరిగినట్టు అధ్యయనాలు చెప్తున్నాయి. అంటే రోజుకు సుమారు 350 ఎకరాల భూముల్లో నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇందులో 35 శాతం (7.5 లక్షల ఎకరాలు) వ్యవసాయానికి పనికిరాని భూములు, మిగతా 65 శాతం (14 లక్షల ఎకరాలు) పంట భూములు ఉన్నట్టు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అంటే.. 14 లక్షల ఎకరాల పొలాలు కాంక్రీట్ జంగల్‌గా మారిపోయాయన్న మాట.

**కాంక్రీట్ జంగల్‌గా మారిన 14 లక్షల ఎకరాల్లో..**

- ఏటా మూడు/రెండు పంటలు ఇచ్చే భూములు 4 లక్షల ఎకరాలు.
- పడావుగా వదిలేసిన భూములు 4 లక్షల ఎకరాలు.
- కనీసం ఒక్క పంట పండే భూములు 4 లక్షల ఎకరాలు.
- అటవీ భూములు 2 లక్షల ఎకరాలు.

**పెరిగిన మూలధన వ్యయం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటికేడు మూలధన వ్యయాన్ని (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్) పెంచడం వల్ల 'బిల్ట్ అప్ ఏరియా' పెరిగినట్టు అధ్యయనాలు చెప్తున్నాయి. ఆర్బీఐ నివేదిక ప్రకారం 2005-06లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మూలధన వ్యయం కింద రూ.1.28 లక్షల కోట్లు ఖర్చు చేయగా.. 2022-23 నాటికి ఈ వ్యయం ఏకంగా రూ.11.92 లక్షల కోట్లకు పెరిగింది. ముఖ్యంగా 2019-23 మధ్య కాలంలో మూలధన వ్యయం భారీగా పెరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ నిధులతో రోడ్లు, రైలు మార్గాలు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులు, ప్రధానంగా జాతీయ రహదారులు నిర్మించినట్టు నివేదికలు చెప్తున్నాయి.

**పర్యావరణానికి విఘాతం కలుగకుండా..**

దేశంలో నిర్మాణాలు శరవేగంగా పెరుగుతుండటంతో పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతున్నదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యధిక శాతం నిర్మాణాలు క్రమపద్ధతిలో కాకుండా విచ్చలవిడిగా జరుగుతుండటంతో సమతుల్యత దెబ్బతింటున్నదని, దీని వల్ల గత 17 ఏండ్లలో సుమారు 2 లక్షల ఎకరాల విస్తీర్ణంలో చెట్లను కోల్పోయామని అంటున్నారు. మరోవైపు దాదాపు 14 లక్షల ఎకరాల పంట భూముల్లో నిర్మాణాలు జరగడంతో లక్షల మంది రైతులు, వారి కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని చెప్తున్నారు. ఇది పంట దిగుబడిపై కూడా ప్రభావం చూపుతున్నదని, ఫలితంగా ఆహార ధరలు పెరుగుతున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు తక్కువ స్థలంలో ఎక్కువ 'బిల్ట్ అప్ ఏరియా'ను అందుబాటులోకి తేవాలని, నిర్మాణాలు క్రమపద్ధతిలో జరిగేలా చూడాలని నిపుణులు విజ్ఞప్తి చేస్తున్నారు.

*గత 17 ఏండ్లలో అత్యధికంగా పశ్చిమ బెంగాల్‌లో 'బిల్ట్ అప్ ఏరియా' పెరుగగా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, తెలంగాణ, ఏపీ, మధ్యప్రదేశ్, కర్ణాటక, బిహార్ వంటి రాష్ట్రాల్లో స్థిరంగా నిర్మాణాలు పెరిగినట్టు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి.*

# ట్రిలియన్ డాలర్లకు తెలంగాణ ఆర్థికం

### 2047 నాటికి చేరుకుందంటున్న సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి డీ ప్రసాద్

హైదరాబాద్, ఏప్రిల్ 26: తెలంగాణ రాష్ట్రం అన్ని విభాగాల్లోనూ రాణిస్తున్నది. ఐటీ, ఫార్మా, వ్యవసాయ రంగంలో అంచనాలకుమించి రాణిస్తున్న రాష్ట్రం..అటు ఆర్థికంలోనూ పెద్ద రాష్ట్రాలను తలదన్నేలా దూసుకుపోతున్నది. ఇదే క్రమంలో 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక రంగం ట్రిలియన్ డాలర్లు లేదా రూ.85 లక్షల కోట్లకు చేరుకునే అవకాశాలున్నాయని భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) తెలంగాణ చైర్మన్ సాయి డీ ప్రసాద్ తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.14.49 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నదన్నారు. నూతన రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ.5 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ..సరాసరి 10 శాతం వృద్ధిని సాధించిందని ఆయన చెప్పారు. ఈ లక్ష్యానికి చేరుకోవాలంటే పెట్టుబడులు, ఉద్యోగ కల్పన, హెల్త్‌కేర్, సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఆర్థిక ఇబ్బందులతో మూతపడుతున్న ఎంఎస్‌ఎంఈలను ఆదుకోవడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందుకోసం ప్రత్యేక కమిటీని సైతం ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వంతో కూడా చర్చలు జరిపినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయలపై మరింత ప్రచారం చేయాల్సిన అవసరం ఉన్నదని, అప్పుడే దేశవ్యాప్తంగా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు రానున్నదన్నారు. అలాగే వ్యవసాయ రంగంతోపాటు తయారీ, ఇన్‌ఫ్రా, రియల్ ఎస్టేట్, విద్యా, టూరిజం రంగాలను ప్రోత్సహించడానికి పలు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.




**వచ్చే ఏడాది వృద్ధి 6.5 శాతమే**

వచ్చే ఏడాది భారత వృద్ధి 6.5 శాతానికి పరిమితం కానున్నదని సీఐఐ అంచనావేస్తున్నది. ఈ ఏడాదిలో 6.8 శాతంగా ఉంటుందని అంచనా వేసిన..సీఐఐ ఆ మరుసటి ఏడాది మాత్రం వృద్ధిలో కోత విధించింది. ప్రపంచ దేశాల ఆర్థిక పరిస్థితులు నిరాశాజనకంగా ఉండటం ఇందుకు కారణమని వెల్లడించింది. ఈ కార్యక్రమంలో సీఐఐ వైస్ చైర్మన్ ఆర్‌ఎస్ రెడ్డి మాట్లాడుతూ..ప్రస్తుతం సీఐఐ తెలంగాణలో 300 మంది సభ్యులు ఉన్నారని, ఈ ఏడాది మరో 50 మందిని చేర్చుకుంటున్నట్లు చెప్పారు.

